క్లుప్తంగా

కరాటే శిక్షణ ప్రారంభం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కొనపాలమూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ఎతినె చెన్నయ్య ఆధ్వర్యంలో కరాటే శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జయశ్రీ మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు



చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీకి కురుమూర్తి స్వామి ఆశీస్సులు ఉండాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పూర్తికావడంతో సోమవారం కురుమూర్తి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు రాధకృష్ణారెడ్డి, మైహెమూద్, వెంకటేష్ పాల్గొన్నారు.

నాణ్యతగా పనులు చేపట్టాలి

జడ్చర్ల: పట్టణంలోని 2వ వార్డులో సోమవారం సీసీ రోడ్డు పనులను స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి ప్రారంభించారు. పనులను సకాలంలో నాణ్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్ మహేశ్, జ్యోతి, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

అడ్డాకుల: మూసాపేట మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన కె.మహేందర్ కొన్నాళ్ల కిందట భూత్పూర్ మండలం అన్నాసాగర్ వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం బాధితుడిని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ పరామర్శించారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు అమరేందర్‌రెడ్డితో కలిసి ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. ఎమ్మెల్యే రూ.5వేలను పంపడంతో వాటిని బాధితుడికి అందజేసి అండగా ఉంటామని తెలిపారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

అడ్డాకుల: ఐకేపీలో పనిచేసే వీఓఏల సమస్యలను పరిష్కరించాలని వీఓఏల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. పెద్దమందడి మండలం మోజర్ల హార్టికల్చర్ కళాశాలలో సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని అడ్డాకుల, పెద్దమందడి మండలాలకు చెందిన వీఓఏలతో కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. వచ్చే నెల 3న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించే విధంగా చొరవ తీసుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు మంజుల, శాంతి, లక్ష్మి, యాదమ్మ, చెన్నమ్మ, యశోద, శారద, విజయలక్ష్మి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని సంతకాల సేకరణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో సోమవారం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం, నాయకుడు అరవింద్ సంతకాల సేకరణ చేపట్టారు. రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు.

లింగపేటలో పశువైద్య శిబిరం

జడ్చర్ల: మండలంలోని లింగంపేటలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ ఏడీ శివానందస్వామి, కోడ్గల్ పశువైద్యురాలు సుప్రియ, సర్పంచ్ మమత తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాచన్‌పల్లి సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మాచన్‌పల్లిలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

గాంధీజీకి ఘన నివాళి

స్టేషన్ మహబూబ్‌నగర్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధన కోసం కృషి చేద్దామని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలోగల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహబూబ్‌నగర్ క్రైం: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీ కార్యాలయంలో మౌనం పాటించారు. ఎస్పీ కె.నరసింహ, డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటరమణారెడ్డి, ఏఓ రుక్మిణిబాయి కొంత సమయం మౌనం పాటించారు.

మిడ్జిల్: మహాత్మాగాంధీ వర్ధంతిని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని పాత మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి



జిల్లా కేంద్రంలోని గాంధీవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భూత్పూర్: పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మహమ్మదాబాద్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్ ఆంజనేయులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవాబుపేట: గాంధీ జీవితం అందరికీ ఆదర్శమని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు.

జడ్చర్ల టౌన్: స్థానిక కావేరమ్మపేట వార్డు కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ప్రజాప్రతినిదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మిడ్జిల్‌లో..



దేవరకద్రలో..

త్యాగమూర్తులను ఆదర్శంగా తీసుకోవాలి



మౌనం పాటిస్తున్న అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తులను ఆదర్శంగా తీసుకుని ముందు కెళ్లాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజాస్ నందులాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, డీఆర్‌డీఓ యాదయ్య, జెడ్పీ సీఈఓ జ్యోతి, ఆర్‌డీఓ యాదయ్య పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



చౌదర్‌పల్లిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

దేవరకద్ర రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చౌదర్‌పల్లి, బల్సుపల్లి, అజిలాపూర్ గ్రామాల్లో రూ.20లక్షలతో కూడిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేసి మాట్లాడారు. గతంలో గ్రామాల్లో సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలతో గ్రామాల్లో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతుందన్నారు. అనంతరం చౌదర్‌పల్లిలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించడంతో పాటు, అజిలాపూర్‌లో చెక్‌డ్యాం నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యుగేందర్ రెడ్డి, విశ్వనాథం, సరోజ, జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సూజాత, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, మూడా సభ్యులు కర్ణం రాజు, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, జెట్టి నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివానంద్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ఏర్పాటు చేయండి..

మండలంలోని నార్లోనికుంట్ల, బస్వాపూర్ గ్రామాలకు ప్రధాన రోడ్డు నుంచి బీటీ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని 5మండలాలకు చెందిన ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లకు, 18 మంది హెల్పర్లకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35మంది లబ్ధిదారులకు, కౌకుంట్ల మండలంలోని 11 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం బల్సుపల్లిలో వివిధ పార్టీలకు చెందిన 40మంది కార్యకర్తలు ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని డీటీఓ కొమల అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేసీ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు బాలస్వామి, కోశాధికారి అంజిలయ్య, సభ్యులు వీణాదేవి, సైదొద్దీన్, ఏటీఓ ఉమాదేవి, శ్రీలత పాల్గొన్నారు.

బాషా పండితులు, పీఈటీలకు అన్యాయం

జడ్చర్ల టౌన్: బాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని, ఉన్నత తరగతులకు బోధన చేయలేమని సోమవారం కోడ్గల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శౌరీకి స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఉన్నత తరగతులకు బోధన చేయరాదని యూనియన్ ఆధ్వర్యంలో జడ్చర్ల, మిడ్జిల్ మండలాల ఉపాధ్యాయులు తీర్మానం చేశారు. యూనియన్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు శశిధర్, తాహేర్, శ్రీనివాసులు, గోబ్రియా నాయక్, అనురాధ, శ్రీదేవి, వాణి పాల్గొన్నారు.

పట్టాదారు పాసు పుస్తకాలు అందించండి

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్‌లో నిరుపేదలకు గతంలో ఇచ్చిన గైరాన్ భూములకు పాత పాసుపుస్తకాలు ఉన్నాయని, ధరణి వచ్చిన తర్వాత నమోదు చేయకపోవడంతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందక రైతుబంధు రావడం లేదని రైతులు సోమవారం తహసీల్దార్ రాజీవ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బ్యాంకు రుణాలు లేక, రైతుబంధు అందక పంట సాగుకు ఇబ్బంది కల్గుతుందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు నర్సింహా, బందిగయ్య, శంకరయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

2న వేలంపాట

జడ్చర్ల: మండలంలోని ఆల్వాన్‌పల్లి శివారులో గల పరుశవేదీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 2న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొబ్బరికాయల విక్రయంతో పాటు ప్రసాదాలు, పార్కింగ్‌కు వేలం పాట నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

నిందితుడి రిమాండ్

బాలానగర్: ఇటీవల తాగిన మైకంలో కట్టుకున్న భార్య, కన్న తల్లిపై కత్తితో హత్యాయత్నం చేసిన మండలంలోని నేరళ్లపల్లికి చెందిన బాలరాజ్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు.

సురక్షిత ప్రయాణం ప్రకటనలకే పరిమితం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ అధికారులు చెబుతున్న సురక్షిత ప్రయాణం ప్రకటనలకే పరిమితమైందని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం నుంచి తిరుగు ప్రయాణంలో శ్రీశైలం డ్యాం దగ్గర అతి వేగంతో అదుపుతప్పి రక్షణగోడకు ఢీకొట్టిన సంఘటన తమకు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని న్యూమోతీనగర్ వర్షగిరి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్, ఉపాధ్యక్షులు శేఖర్, నాగేష్, వెంకటస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కోయిల్‌కొండ మండలంలోని గార్లపహాడ్‌ను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి నాయకులు మున్నూర్ రవి, మైత్రి యాదయ్య మాట్లాడుతూ గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేస్తే 16 గ్రామ పంచాయతీలు ఉంటాయన్నారు. గ్రామంలో సొసైటీ బ్యాంక్, ప్రభుత్వ ఆస్పత్రి, వ్యవసాయ సొసైటీ కార్యాలయం, పాథమిక, ఉన్నత, జెడ్పీ పాఠశాలలు ఉన్నాయన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వెంకట్రావ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సాధన సమితి నాయకులు రాంచంద్రయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాండం తొలుచు పురుగును నివారించాలి



కుచ్చర్‌కల్‌లో సూచనలు చేస్తున్న ఏఓ నరేందర్

రాజాపూర్: రైతులు వరిపంటలో కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుచ్చర్‌కల్‌లో రైతులు సాగు చేసిన వరిసాగును క్షేత్రస్థాయిలో పరిశీలించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. కాండం తొలిచే పురుగుతో పాటు అగ్గితెగులు, సుడిదోమ పంటలను నష్టపరుస్తున్నదని అన్నారు. అగ్గితెగులు, కాండం తొలిచే పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50శాతం, ఎస్‌పీ400 గ్రాములు లేదా క్లోరాంట్రానిప్రోల్ 60 మిల్లీలీటర్ల మందును ఒక ఎకరాకు చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు.

దాడులకు పాల్పడితే సహించేది లేదు

చిన్నచింతకుంట: బీజేపీ నాయకులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని పార్టీ మండల అధ్యక్షుడు దశరథ్, మాజీ అధ్యక్షుడు కుర్వ రమేష్ అన్నారు. ఆదివారం కురుమూర్తిలో బీజేపీ నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ధర్నా చేపట్టి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాసన్న, చంద్రయ్య పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. చిన్నచింతకుంటలో బీజేపీ నాయకులు ఇళ్లపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తూ కొత్త బస్టాండ్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం బీజేపీ యువమోర్చా నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కురుమూర్తి, రఘుపతి, బీజేవైఎం మండల అధ్యక్షుడు విష్ణు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

నవాబుపేట: క్షయవ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయపై వ్యాధిపై అవగాహన కలిగించి సమాజం నుంచి పూర్తిగా తరిమివేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌గౌడ్, హెచ్ఎం జరినాబేగం, వైద్య సిబ్బంది శరబలింగం, అవినాష్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగుపై ప్రత్యేక శ్రద్ధ..

కంటి వెలుగు కార్యక్రమంపై మరింత చొరవ చూపి కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి జరినాభాను అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు కొల్లూర్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమంను పరిశీలించారు.



గాధిర్యాల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు

మహమ్మదాబాద్: క్షయవ్యాధి నివారణకు పాటుపడదామని గాధిర్యాల్ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని గాధిర్యాల్, జూలపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

అడ్డాకుల: మండలంలోని వర్నె వద్ద వాగులో ఇసుక తరలింపును సోమవారం మరోసారి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈనెల 27న గ్రామానికి సమీపంలో ఉన్న ఊకచెట్టు వాగులో ప్రభుత్వ అనుమతి ద్వారా ఇసుక తరలించేందుకు యత్నిస్తే గ్రామస్తులు అడ్డుకున్నారు. వనపర్తి జిల్లాలోని గ్రామాలకు ఇక్కడి నుంచి ఇసుకను ఎలా తరలిస్తారని ప్రశ్నిస్తూ వాహనాలను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారుల జోక్యంతో వాహనాలను వదిలేశారు. తాజాగా సోమవారం ఉదయం వాగులో ఇసుక నింపుకోవడానికి వచ్చిన టిప్పర్లను గ్రామస్తులు మరోసారి అడ్డగించారు. ఇక్కడి నుంచి ఇసుకను తరలించొద్దని రైతులు ఆందోళన చేశారు. అధికారులు జోక్యం చేసుకోవడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



ఇసుక నింపే యంత్రాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి



కంటి వెలుగు శిబిరం సందర్శించిన డీఎంహెచ్ఓ కృష్ణ

జడ్చర్ల టౌన్: కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. అవసరమైన ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేసి తగిన సూచనలు, అద్దాలను ఇవ్వాలన్నారు. శిబిరానికి వచ్చేవారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు 15వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్ పాలాది సారికలు సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వార్డు కౌన్సిలర్ సతీష్, మున్సిపల్ ఆర్‌ఓ శశిధర్ పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా

మిడ్జిల్: మండలంలోని ఈదులబావి తండాలో కొనసాగుతున్న కంటి వైద్య శిబిరాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ పరిశీలించారు. ప్రజలను వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మనుప్రియ, కృష్ణకుమార్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: కంటి వెలుగు కార్యాక్రమాన్ని నిర్వాహకులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. సోమవారం మండలంలోని పారుపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

అలరించిన శకటోత్సవం



రాచాలలో ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎద్దుల బండ్లు

అడ్డాకుల: మండలంలోని రాచాలలో వెలిసిన చెన్నకేశవస్వామి జాతరను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ఆలయం వద్ద శకటోత్సవాన్ని నిర్వహించారు. ఎద్దుల బండ్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ఆవరణలో భక్తులు దాసంగాలను పెట్టి స్వామి వారికి సమర్పించారు.

బండెనుక బండి కట్టి..

నవాబుపేట: మండలంలోని పోమాల్‌కు చెందిన రైతు కుటుంబాలు గంగాపూర్ జాతరకు ఎద్దుల బండ్లపై వెళ్లి తిరిగి సోమవారం గ్రామానికి చేరుకున్న క్రమంలో మండల కేంద్రంలో బండ్లు సందడి చేశాయి.



నవాబుపేట రోడ్డులో ఎద్దుల బండ్లు

నష్టపరిహారం అందజేత

అడ్డాకుల: మండలంలోని మహ్మదుస్సేన్‌పల్లికి చెందిన గొర్రెల కాపరుల గొర్రెలు కలుషిత నీళ్లు తాగి మృత్యువాతపడిన సంఘటనలో బాధితులకు మంత్రి చొరవతో రూ.6లక్షల పరహారం అందినట్లు సర్పంచ్ నిర్మల కాశీనాథ్ తెలిపారు. గ్రామానికి చెందిన నలుగురు కాపరులు గొల్ల హనుమప్ప, ఎర్ర మల్లయ్య, గొల్ల రాములు, మల్లయ్యలు తమ గొర్రెలను సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలానికి మేత కోసం తరలించారు. అక్కడ నందికండి గ్రామ సమీపంలో ఉన్న ఓ విత్తనాల పరిశ్రమ వద్ద ఆదివారం కలుషిత నీళ్లు తాగి సుమారు 80 గొర్రెలు మృతిచెందిన విషయం విధితమే. కాగా స్థానిక సర్పంచ్, కాపరులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో పరిశ్రమ నిర్వాహకులు నలుగురు కాపరులకు కలిపి రూ.6లక్షల చెక్కులను అందజేసినట్లు సర్పంచ్ నిర్మల కాశీనాథ్ తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యేకు కాపరులు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భూత్పూర్: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న మునిరంగస్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 10 నుంచి నిర్వహిస్తున్నట్లు చైర్మన్ బస్వరాజ్ గౌడ్ తెలిపారు. సోమవారం మునిరంగస్వామి ఆలయం ఎదుట వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. వారం రోజుల పాటు జరిగే బ్రహోత్సవాల్లో భాగంగా 10న మునిరంగస్వామి ఊరేగింపు, 11న రథోత్సవం, 12న శకటోత్సవం (బండ్లు), 13న పుట్టసేవ, 14న ఉత్సవాలు, 15న కల్యాణోత్సవం, 16న పల్లకీసేవ, 17న అవభృత అభిషేకం, ముగింపు కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ముడా డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, కౌన్సిల్ నాగమ్మ, సింగిల్ విండో డైరెక్టర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ బస్వరాజ్ గౌడ్